క్లుప్తంగా

మానవతా సంస్థకు ఫ్రీజర్ బాక్స్ విరాళం



ఫ్రీజర్‌బాక్స్‌ను విరాళంగా అందజేస్తున్న జీవీ సుబ్బారెడ్డి

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల మానవతా సేవా సంస్థకు పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు మంగళవారం ఫ్రీజర్ బాక్స్ విరాళంగా అందజేశారు. ఈ మేరకు సంస్థ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి, అధ్యక్షుడు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో దాతను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంస్థ ఉపాధ్యక్షుడు రామచంద్రరాజు, సెక్రటరీ రామ సుబ్బారెడ్డి, కార్యవర్గ సభ్యులు మురళీ మోహన్ రెడ్డి, తిమ్మారెడ్డి, నాగిరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, రామ చంద్రారెడ్డి, మద్దిలేటి, నాగరాజు, సత్యనరసింహులు, ఓబుళరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కేశాల్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.

మైనార్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు



విద్యార్థుల వేలిముద్రలు సేకరిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: ముస్లిం, క్రిష్టియన్ మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం ఉపకారవేతనాలను అందజేస్తోందని ఎంఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి ఉపకార వేతనాల ఎంపికకు విద్యార్థుల వేలిముద్రల సేకరణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలతోపాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 9,10వ తరగతి చదువుతున్న ముస్లిం, క్రిష్టియన్ మైనార్టీ విద్యార్థినీ, విద్యార్థులు ఉపకార వేతనాలకు అర్హులన్నారు. ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ. 5,700 చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రగతి విద్యాసంస్థల అధినేత ఎస్‌ఏ గఫూర్, హెచ్‌ఎం అరిఫా, మీసేవా కేంద్రం నిర్వాహకుడు భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



చేయూత ట్రస్టుకు నగదు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

డోన్ : పట్టణ శివారులోని వైఎస్ నగర్ సర్వీసు రోడ్డుపై జరిగిన ప్రమాదంలో మృతి చెందిన గిరి కుటుంబ సభ్యులకు ద్రోణాచలం రెసిడెన్షియల్ కమ్యూనిటీ క్రికెట్ క్లబ్ సభ్యులు మంగళవారం రూ.14వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ ప్రమాదంలో గిరి మృతి చెందగా ఆయన భార్య శిరీష ఇప్పటి వరకు కోమాలో ఉన్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం చేయూత ట్రస్టు విరాళాల సేకరణను క్లబ్ సభ్యుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

టంగుటూరు పెద్దమ్మకు బంగారుహారం విరాళం



బంగారుహారాన్ని అందజేస్తున్న దాతలు బొల్లి మద్దయ్య కుటుంబ సభ్యులు

బనగానపల్లెరూరల్: మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసని శ్రీపెద్దమ్మకు మంగళవారం ఎర్రగుడి గ్రామానికి చెందిన బొల్లి మద్దయ్య కుటుంబ సభ్యులు రూ.1.70లక్షల విలువ బంగారం హారాన్ని విరాళంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందజేశారు. ఈమేరకు దాతను కమిటీ సభ్యులు అభినందించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

బనగానపల్లె: మండలంలోని పసుపల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసిన పది మంది విద్యార్థులకు బయేస్టాట్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున స్కాలర్ షిఫ్ అందజేశారు. గతేడాది పదిలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహంగా నగదు అందజేశామని సంస్థ రిజనల్ మేనేజర్ వరప్రసాద్ పేర్కొన్నారు. సెల్స్ ఆఫీసర్ సుధాకర్, గ్రామ సర్పంచ్ మోహన్‌బాబు, బనగానపల్లె మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, హెచ్‌ఎం రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కోవెలకుంట్ల: బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేటకు చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు కోవెలకుంట్ల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన చింతమాను తిరుపాలు అనే వ్యక్తి పనుల నిమిత్తం మూడు రోజుల క్రితం కోవెలకుంట్ల మండలంలోని జోళదరాశి గ్రామానికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహిలను ఆరా తీసినా ఆచూకీ లభ్యం కాలేదు. భార్య కొండమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

‘చిరు’ సాగు... లాభాలు బాగు!

- ఏటేటా పెరుగుతున్న చిరు ధాన్యాల సాగు
- కొర్ర వినియోగానికి పూర్వ వైభవం
- రైతులకు, వినియోగదారులకు లాభదాయకంగా మారిన వైనం



సాగు చేసిన రాగిపైరు,



ఊద పంట సాగు చేసిన దృశ్యం

బనగానపల్లె: చిరుధాన్యాల సాగు ఏటేటా పెరుగుతుంది. వ్యవసాయ రంగంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు, అగ్రికల్చర్ అధికారులు, యాగంటిపల్లె కేవీకే శాస్త్రవేత్తల కృషి, మారుతున్న కాలానికనుగుణంగా రైతులు సైతం చిరుధాన్యాల సాగుకు మొగ్గు చూపుతున్నారు. లాభాలు చేరవేస్తున్న కొర్ర, సజ్జ, రాగి, వరిగ, సామలు, అరికలు, ఊదలు తదితర చిరుధాన్యాలు సాగు చేస్తున్నారు రైతులు. ఉమ్మడి కర్నూలు జిల్లాల్లో సుమారు 8 వేల హెక్టార్లలో ఈ పంటల సాగు ఉండగా బనగానపల్లె నియోజవర్గంలో సుమారు 600 హెక్టార్లలో సాగు అవుతుందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ సైతం చిరు సాగును ప్రోత్సహిస్తూ రాగులకు ఏకంగా క్వింటాకు రూ.3,846 ప్రకటించింది. రైతులు పండించిన ఈ పంటలను సివిల్ సప్లయ్ శాఖ ద్వారా కొనుగోలు చేయనుంది. నాలుగు దశాబ్దాల క్రితం చిరు ధాన్యాలకు అత్యధిక ప్రాధన్యత ఉండేది. ప్రత్యేకించి బనగానపల్లె నియోజకవర్గంలో కొర్ర సాగు అత్యధికంగా ఉండేది. అప్పట్లో సాగు నీటి వనరులు చాలా తక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రధాన పంట జొన్న, కొర్ర. కాలానుగుణంగా సాగు వనరులు పెరగడం, వాణిజ్య పంటల సాగుకు రైతులు ప్రాధాన్యతనివ్వడంతో చిరు ధాన్యాల సాగు తగ్గుతూ వచ్చింది. ప్రస్తుతం పరిస్థితులు, ప్రజల ఆరోగ్య సంరక్షణ నేపథ్యంలో మళ్లీ చిరు ధాన్యాలకు ప్రాముఖ్యత సంతరించుకుంది. ప్రజల ఆరోగ్యానికి మేలు... రైతులకు లాభాలు అన్నవిధంగా మారింది చిరుధ్యాన్యాల సాగు. గతంలోలా కొర్ర వినయోగానికి పూర్వ వైభవం నానుందని వృద్ధులైన రైతులు పేర్కొంటున్నారు.

పెరిగిన చిరు ధ్యాన్యాల వాడకం

ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో చిరుధాన్యాల వాడకం పెరిగింది. స్పీడ్ యుగంలో ఒత్తిళ్లు, ఆహార అలవాట్ల మూలగా ఆరోగ్య సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దీంతో వైద్యుల సూచనల మేరకు మళ్లీ చిరు ధ్యాన్యాల వాడకాన్ని అలవర్చుకోవాల్సి వచ్చింది. దీంతో వాటి వాడకానికి ప్రజలు ఇష్టపడుతుండగా రైతులు సైతం సాగుకు మొగ్గు చూపుతున్నారు. ప్రజల్లో సైతం ఆరోగ్యంపై చైతన్యమయ్యారు. తృణధాన్యాల ప్రాముఖ్యతను తెలుసుకుంటున్నారు. హోటల్లో సైతం రాగిముద్ద ప్రత్యేక ఆహారంగా అమలు చేస్తున్న తీరు ఇందుకు నిదర్శనం.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



చిరు ధాన్యాల సాగు లాభదాయకంగా ఉంటుంది. ప్రస్తుతం చిరుధాన్యాల వినియోగం బాగా పెరిగింది. పెట్టుబడి ఎక్కువగాలేని చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలి. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితుల నేపథ్యంలో ప్రతిఒక్కరూ చిరు ధాన్యాలు వాడాల్సిన పరిస్థితి నెలకొంది. కొర్ర, సజ్జ, రాగి, వరిగ, సామలు, అరికలు, ఊదలు వాడకం ఆరోగ్యానికి ఎంతో మేలు. రైతుల విరివగా సాగు చేయాల్సిన అవసరం ఉంది. – సుధాకర్ వ్యవసాయశాస్త్రవేత్త కేవీకే, యాగంటిపల్లె గ్రామం బనగానపల్లె మండలం

నేడు ఉపాధి పనులపై బహిరంగ సభ

బేతంచెర్ల: మండలంలో1.4.2022 నుంచి 31.03.2023 వరకు జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి గ్రామాల్లో 17వ విడత సామాజిక తనిఖీ బృందాలు నిర్వహించిన తనిఖీ వివరాలపై బుధవారం ఎంపీడీఓ కార్యాయలం ఆవరణలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంగన్న తెలిపారు. బహిరంగ సభలో గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల తనిఖీ వివరాలను వెల్లడిస్తారని, ప్రజలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తప్పక హాజరు కావాలన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ప్యాపిలి: పట్టణంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న గంగప్ప (70) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. దాదాపు 15 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న గంగప్పకు బంధువులు లేరు. గంగప్ప ఫోన్‌లో నంబర్ల ఆధారంగా అనంతపురం జిల్లాలోని బంధువులకు సమాచారం ఇచ్చేందుకు స్థానికులు ప్రయత్నించారు. అయితే వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో పట్టణానికి చెందిన చిన్న సుంకయ్య, సంజీవ, మోహన్ తదితరులు అంత్యక్రియలు నిర్వహించేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు వారు గంగప్ప మృతదేహానికి స్థానిక హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ రాజా నారాయణమూర్తి గురుదత్త సేవా సమితి ఆధ్వర్యంలో వైకుంఠరథాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చరణ్, సంపత్, ఖాజా, ప్రసాద్, నారాయణ, రాము, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీమద్రామాయణం మానవుని శక్తిని తెలియజేస్తోంది



ఆధ్యాత్మిక బోధనలు చేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : శ్రీమద్రామాయణం మానవుని మహోన్నత శక్తిని తెలియజేసే గ్రంథమని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి, కవిరాజహంస బిరుదాకింతుడు డాక్టర్ తొగట సురేస్ బాబు తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించే ధార్మిక కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం మండలంలోని వెంకటనాయునిపల్లెలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఆధ్యాత్మిక బోధనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నియుగాల క్రితం వాల్మీకి మహర్షి అందించిన శ్రీమద్రామాయణం ఎన్నో పరీక్షలకు తట్టుకొని ఎప్పటికి మానవులంత ఇలాగే నడుచుకోవాలని ప్రబోధించిన గ్రంథం శ్రీమద్రామాయణం అన్నారు. కార్యక్రమంలో అర్చకులు మీనేశ్వరయ్య, భజనమండలి సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆ నల్గురు స్వచ్ఛంద సేవలు ఆదర్శం



వన్నూర్ బాషాకు నగదు అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: సమాజంలో నా అనేవాళ్లు లేక మరణించిన వారికి సొంత కుటుంబ సభ్యుల్లా ఆ నల్గురు స్వచ్ఛంద సంస్థ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించడం అభినందనీయం అని మెడికల్ షాపు నిర్వాహకుడు కొప్పరవు మురళీ మోహన్ అన్నారు. మంగళవారం కొప్పరవు రంగమ్మ జ్ఞాపకర్థం రూ.20 వేలను సంస్థ అధ్యక్షులు వన్నూర్ బాషాకు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు అగ్బర్, మల్లికార్జున, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

25న సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం

డోన్ టౌన్ : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన పనులపై 16వ విడత సామాజిక తనిఖీ బృందం సభ్యులు నివేదకలపై ఈనెల 25వ తేదీన శుక్రవారం స్థానిక స్త్రీ శక్తి భవనం(జాడీల ఫ్యాక్టరీ)లో బహిరంగ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ డోన్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. గ్రామాల్లో 01-04-2022 నుండి 31-03-2023 వరకు చేట్టిన పనులపై సోషల్ ఆడిట్ సభ్యులు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించే ఈ బహిరంగ సమావేశంలో చేసిన పనులపై ఏవైన అభ్యంతరాలు ఉంటే సమావేశం దృష్టికి తీసుకరావచ్చన్నారు. ఈ సమావేశానికి జిల్లా, మండల స్థాయి అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులకు తైవాన్ స్ప్రేయర్లను అందజేస్తున్న రఘువరణ్

బనగానపల్లెరూరల్ : ఉద్యానవనశాఖ ద్వారా ప్రభుత్వం రైతులకు ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని బనగానపల్లె డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి రఘువరణ్ సూచించారు. మంగళవారం స్థానిక ఉద్యానవనశాఖ కార్యాలయంలో కైప గ్రామానికి చెందిన రైతులు వెంకటమద్దిలేటి, ప్రభావతి, సుధాకర్‌కు రాయితీపై మంజూరైన స్ప్రేయర్లు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్ప్రేయర్లు ధరలో చిన్నకారు రైతులకు రూ.10వేలు, పెద్దకారు రైతులకు రూ.8వేల ప్రకారం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

సంక్షిప్తం

ఆర్థిక సాయం

డోన్ టౌన్ : అనారోగ్యంతో మృతి చెందిన వడ్డె మద్దయ్య కుటుంబానికి అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా రూ. 5వేలను వడ్డేర సంక్షేమ సంఘం నాయకులు అందజేశారు. పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో నివాసం ఉండే మద్దయ్య మంగళవారం మృతి చెందడంతో సంఘం సభ్యులు మృతుని ఇంటికి వెళ్లి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో అధ్యక్షులు నాగరాజు, నాయకులు రంగస్వామి, శ్రీనివాసులు, గోవిందు, సుంకన్న, సూర్యచంద్ర పాల్గొన్నారు.

కోలుకోలేక మహిళ మృతి

డోన్ టౌన్ : పాముకాటుకు గురై కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక చాకలి సుమలత (36) మృతి చెందినట్లు రూరల్ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. మండలంలోని మల్యాలకు చెందిన చాకలి నాగయ్య భార్య సుమలత ఈనెల 17న గ్రామ సమీపంలో ఉన్న రైల్వే స్టేషన్ వద్ద వ్యవసాయ పనులకు వెళ్లగా పాముకాటుకు గురైనట్లు తెలిపారు. గమనించిన తోటి కూలీలు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా డోన్‌కు తరలించి ప్రథమ చికిత్సల అనంతరం కర్నూలుకు తీసుకెళ్లారు. భర్త పిర్యాధు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలి

బనగానపల్లెరూరల్: దేశ సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్వర్ణలతాదేవి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారిణి కౌలస్యదేవి సూచించారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో స్వాతంత్ర సమరయేధుల సన్మాన కార్యక్రమం ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగింది. పట్టణానికి చెందిన సీనియర్ అధ్యాత్మిక గురువు రామశేషయ్యను పూలమాల దుశ్శాలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూ కో ఆర్డినేటర్ డాక్టర్ బడేసాహెబ్, అధ్యాపకులు బాబునాథ్, వసుందరమ్మ, ఉమామహేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, వహిదా, ఉమాశంకర్, నారాయణ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై శాంతి ర్యాలీ

కొలిమిగుండ్ల: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా మంగళవారం మండల కేంద్రం కొలిమిగుండ్లలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు మాట్లాడుతూ రెండు నెలల పైగా మణిపూర్‌లో సంఘటనలు జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు.

జీఓ నంబర్ 21 రద్దు చేయాలి

బేతంచెర్ల: ఆటో, లారీ డ్రైవర్లకు ఉరితాడులా ఉన్న జీఓ నంబర్ 21 రద్దు చేయాలని లారీ వర్కర్స్ యూనియన్ పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో లారీ, ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో డ్రైవర్లు తిరుమలేశ్, వెంకటసుబ్బయ్య, తిమ్మరాజు పాల్గొన్నారు.

మంత్రికి అంగన్‌వాడీల వినతి



మంత్రి బుగ్గనకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని స్వగృహంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం అంగన్‌వాడీ వర్కర్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలను అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శేబారాణి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు నాగలక్ష్మి, విజయలక్ష్మి, శ్రీదేవి, రాధాదేవి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో డోన్ అగ్రగామి

- గోరుకల్లు రిజర్వాయర్ నుంచి ప్రతి ఇంటికీ తాగునీరు
- అభివృద్ధి పనులను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధుల బృందం



బుగ్గానిపల్లె వద్ద ఫిల్టర్ బెడ్లను పరిశీలిస్తున్న దృశ్యం



గోరుకల్లు రిజర్వాయరు వివరాలు తెలుసుకుంటున్న నాయకులు

డోన్‌టౌన్ : రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా ఉద్దానం, కడప జిల్లా పులివెందులతో పాటు నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలో కోట్లాది రుపాయలతో వాటర్ గ్రిడ్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్‌ను అభివృద్ధి పథంలో అగ్రగామిగా నిలిపారన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి డోన్ నియోజకవర్గంలో ఇంటింటికీ తాగు నీరు సరఫరా చేసేందుకు చేపట్టిన పైపులైన్ నిర్మాణ పనులను మంగళవారం డోన్ మండలం ప్రజాప్రతినిధులు, వైస్సార్‌సీపీ నాయకుల బృందం పరిశీలించింది. రిజ్వరాయరు వద్ద ఇన్‌టెక్‌వెల్, బుగ్గానిపల్లె తాండ వద్ద పిల్టర్ బెడ్లు, వాటర్ సంప్, మద్దిలేటి స్వామి ఆలయ పునరుద్దరణ పనులు, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులు, వెంకటాపురం తుమ్మల చెరువు వద్ద బోటు షికారు కేంద్రం తదితర అభివృద్ధి పనులను నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ నియోజకవర్గంలోని 138 గ్రామాలు, డోన్, బేతంచెర్ల మున్సిపాల్టీల పరిధిలో 585 కిలో మీటర్ల పొడవునా తాగు నీటి సరఫరాకు పైపులైన్ నిర్మించడం జరిగిందన్నారు. గోరుకల్లు రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 12టీఎంసీలు కాగా ఇందులో 0.60టీఎంసీ నీరు అవసరమని ప్రభుత్వం గుర్తించందన్నారు. ఒక ఏడాది పాటు వర్షాలు కురవపోయినా రిజర్వాయరులో డెడ్ స్టోరేజీ నీటి ద్వారా మంచినీటిని నియోజకవర్గానికి అందించే అవకాశం ఉందని నిపుణులు తెలియజేశారని వారు వివరించారు. వచ్చే డిసెంబర్ నాటికి బేతంచెర్ల, డోన్ మండలాల పరిధిలోని ఇంటింటికీ తాగు నీటిని అందించేందుకు ట్రయల్ రన్ పూర్తి చేస్తామని ఇంజినీర్లు తెలిపారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, సింగిల్ విండో చైర్మన్ తిరునాంపల్లె తిరుమల రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చంద్రన్న, వైస్ ఎంపీపీ ఎర్రస్వామి, మంత్రి పీఏలు రమేష్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగన్న, బంగారు జయచంద్ర, బొబ్బల శివరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, చిరంజీవి, మధుసూధనరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మధురెడ్డి, పేరన్న, గట్టు, రాజు, ఎంఎస్‌రెడ్డి, చిన్నమద్ది, తిమ్మారెడ్డి, శ్రీరాములు, రాజేశ్వరరెడ్డి, మాధవస్వామి, బద్దల నాగరాజు,శ్రీను, వేమారెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పశ్చిమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన వైఎస్సార్

దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గాజుదిన్నె ప్రాజెక్టు ద్వారా డోన్‌కు తాగు నీరు అందించడంతోపాటు హంద్రీ నీవా కాలువ తవ్వడం ద్వారా జిల్లాలోని కరువు పీడిత ప్రాంతమైన పశ్చిమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసారని శ్రీరాములు, రాజశేఖర్‌రెడ్డి గుర్తు చేశారు. అదేతరహాలో ప్రజల తాగు నీటి అవసరాలు తీర్చేందుకు వాటర్ గ్రిడ్ పథకాన్ని అమలు చేయడంతో పాటు 68చెరువులను హంద్రీ నీవా కాలువ నీటితో నింపేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు. మంత్రి బుగ్గన చొరవతో డోన్ నియోజకవర్గంలో మరో యాభై ఏళ్లపాటు తాగు, సాగు నీటి సమస్య ఉండదని స్పష్టం చేశారు.

మోడల్ నియోజకవర్గంగా డోన్

డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మంత్రి బుగ్గన అభివృద్ధి పనులు చేపడుతున్నారని శ్రీరాములు, రాజశేఖర్‌రెడ్డి గుర్తు చేశారు. రూ.40 కోట్లతో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, రూ.3కోట్లతో గుండాల గ్రామం, డోన్ పట్టణంలో టీటీడీ కల్యాణ మండపాల నిర్మాణం, రూ. 80 కోట్లతో జాతీయ రహదారి, ఫ్లైఓవర్‌లు, సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయించారన్నారు. రూ. 15కోట్లతో పట్టణంలో 7 పార్కులను, యర్రగుంట్ల రహదారిలో రూ. 3కోట్లతో నగరవనం పార్కును ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పాలిటెక్నిక్, విద్యార్థుల కోసం వసతి గృహం, ఎస్సీ, బాలికలు, బీసీ బాలుర గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారన్నారు. త్వరలోనే నర్సింగ్ కళాశాలతో పాటు కేంద్రీయ విశ్వ విద్యాలయం ప్రారంభం కానున్నాయని చెప్పారు. యువత ఉపాధి కోసం కొత్త కోట వద్ద డ్రైవింగ్ స్కూల్, డోన్ ప్రభుత్వ ఐటీఐలో కియా మోటార్స్ శిక్షణా కేంద్రం, ప్యాపిలి మండలం కొమ్మెమరి గ్రామం వద్ద వెటర్నటీ పాలి టెక్నిక్, గొర్రెల పెంపకం శిక్షణా కేంద్రం, జాడీల ఫ్యాక్టరీలో మహిళలకు కుట్టు శిక్షాణ కేంద్రంతో పాటు ఏపీ నైపుణ్యాభివృద్ధి శిక్షాణ కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. అదేవిధంగా మద్దిలేటి స్వామి, కంబగిరి స్వామి, గుండాల చెన్న కేశవస్వామి ఆలయాల పునరుద్ధరణ, కల్యాణ మండపాలకు రూ. కోట్లు మంజూరు చేయించారని వివరించారు.

ఈ- క్రాప్ తప్పనిసరి

కోవెలకుంట్ల: మండలంలో సాగు చేసిన పంటల వివరాలను రైతులు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏఓ నిరంజన్ సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు మినుము, మొక్కజొన్న, పెసర, కంది, బెండ తదితర పంటలు సాగు చేశారన్నారు. పంటలు సాగు చేసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఈ క్రాప్ చేయించుకోవాలని పేర్కొన్నారు.

షెడ్డు నిర్మాణానికి విరాళం

డోన్ : పట్టణంలోని పాత ఆంధ్రబ్యాంక్ ఎదురుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద రోటరీక్లబ్ నిర్మిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ షెడ్డు నిర్మాణానికి మంగళవారం పారిశ్రామికవేత్త ఎస్‌ఎల్ మధు రూ.10వేలు విరాళంగా అందజేశారు. తన కుమార్తె మేఘన, అల్లుడు చరణ్‌అశ్విన్ పెళ్లిరోజును పురస్కరించుకొని రోటరీ క్లబ్‌కు ఈ సహాయాన్ని అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, కార్యదర్శి నాయక్, విజయగ్యాస్ అధినేత రాజా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టాలి

ప్యాపిలి: ఇంటి పరిసరాల్లో దోమల వ్యాప్తిని అరికట్టి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వైద్యాధికారిణి వాణిశ్రీ అన్నారు. స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది మంగళవారం పట్టణంలో ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. దోమల ద్వారా మలేరియా, బోధకాలు, చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధి, డెంగీ తదితర వ్యాధులు ప్రభలుతాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్, కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ విజయకుమారి, సబ్ యూనిట్ అధికారి రాజశేఖర్ రెడ్డి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

కోవెలకుంట్ల: ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాదిగలకు న్యాయం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకుడు కత్తి సుబ్బయ్య అన్నారు. మంగళవారం కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన మాట మార్చిందన్నారు. వర్గీకరణ సాధనకు ఈ నెల 24వ తేదీన నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి మాదిగలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కొత్త సిమెంట్ ఫ్యాక్టరీకి రోడ్డు ఏర్పాటుకు భూమి పరిశీలన



భూమిని పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

కొలిమిగుండ్ల: పెట్నికోట సమీపంలోని కొండపై అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ ఏర్పాటు చేయనున్న కొత్త ప్లాంట్‌కు సంబంధించి రోడ్డు ఏర్పాటుకు భూమిని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఇటీవలనే సిమెంట్ కంపెనీ ప్రతినిధులు అప్రోజ్ రోడ్డు కోసం 38.19 ఎకరాల ప్రభుత్వ భూమి మంజూరు చేయాలని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. కస్తూర్బా సమీపంలోని ఇటిక్యాల రెవెన్యూ పరిధిలోని భూమిని పరిశీలించిన జేసీ తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిమెంట్ కంపెనీ దరఖాస్తు చేసిన భూమి పరిధిలో వాగులు, వంకలు ఏవైనా ఉన్నాయా అని ఆరా తీశారు. భూమి కేటాయింపుపై ప్రజల నుంచి అభ్యంతరాలు ఉంటే స్వీకరిస్తామన్నారు. అన్నీ సజావుగా ఉంటే కంపెనీకి రోడ్డు కోసం భూమి మంజూరు చేస్తామన్నారు.

165 కొత్త పింఛన్‌లు మంజూరు



పెట్నికోటలో విచారణ చేస్తున్న ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి

కొలిమిగుండ్ల: మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో కొత్తగా 165 పింఛన్‌లు మంజూరైనట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఏ పింఛన్‌కు దరఖాస్తు చేశారు... అర్హులా కాదా తదితక విషయాలను పరిశీలించారు. 165 పింఛన్లలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్‌లు వచ్చాయన్నారు. ఒంటరి మహిళ, డప్పు, చర్మ కళాకారులకు సంబంధించి మంజూరు కావాల్సి ఉందని ఎంపీడీఓ తెలిపారు.

బయోమెట్రిక్ తప్పక వేయాలి

గ్రామ సచివాలయ సిబ్బంది ప్రతి రోజు సమయ పాలన పాటించి సకాలంలో బయోమెట్రిక్ వేయాలని ఎంపీడీఓ సూచించారు. పెట్నికోట, బెలుం సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులతో పా టు బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. తక్కువ హాజరు శాతం ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే ప్రజల పట్ల బాధ్యతగా మెలిగి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.

వసతి గృహం ఆవరణలో బండరాళ్లు తొలగింపు



జేసీబీతో బండరాళ్లు తొలగిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న బీసీ బాలుర హాస్టల్, ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలోని బండరాళ్లు, పిచ్చిమొక్కలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువనేత కాటసాని ఓబులరెడ్డి సహకారంతో జేసీబీ ద్వారా మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా హాస్టల్ వార్డెన్ నాగేంద్ర మాట్లాడుతూ తమ విన్నపం మేరకు సమస్యల పరిష్కారానికి కాటసాని ఓబులరెడ్డి చర్యలు చేపట్టారని వార్డెన్ చెప్పారు. జేసీబీని ఏర్పాటు చేయడంతో బండరాళ్లను తొలగించి ఆవరణాన్ని చదును చేయించినట్లు వార్డెన్ తెలిపారు. త్వరలో విద్యార్థులకు అవసరమైన స్పోర్ట్ మెటీరియల్‌తో పాటు ఫ్రిడ్జ్‌ను కూడా కాటసాని ఓబులరెడ్డి అందించనునట్లు వార్డెన్ తెలిపారు.